వేమకోటి సీతారామశాస్త్రి

# తెర

సూర్యోదయమైంది. అందరిళ్ళలోకి వెలుగు వచ్చినా వెలుగురాని గూళ్ళమైన యిల్లది. మొదటి రెండు మిద్దె గదులు తర్వాత వంటిల్లు పెరట్లో నంద నుయ్యి యిక్ష్వాకులనాడు తయారు చేసిన కర్ర కిటికీలు చిన్నవి, చెదలు పడుతున్న గుమ్మాలు, నేడో రేపో—కూలి పోవడానికి సిద్ధంగా వున్నట్లుగా వుంటుందా యిల్లు.

ఆ యింటి యజమాని భార్య శాంతమ్మ గారు వంటింట్లో కూర్చుని కాఫీ కలుపుతోంది. యజమాని జగన్నాథం ముక్కు మూసుకుని దేవుడి దగ్గర జపం చేస్తున్నాడు. గాలి వెలుతురు లేని ఆ గదిలో చీకటి కోయలేని చిరుదీపం దేవుడు ముందు నీరసంగా వెలుగుతోంది.

శాంతమ్మగారి మనస్సు మనస్సులో లేదు. పెద్ద మనిషయినా వోణీ వేసుకోని రెండో పిల్ల దేవి, దాని తర్వాత వ్యక్తురాళ్ళు, కావడానికి సిద్ధంగావున్న మరో యిద్దరాడ పిల్లల్ని తదేకంగా చూస్తోంది. వాళ్ళు, సినిమాల గురించి వాళ్ళు కట్టుకున్న బట్టలు గురించి అలంకరణ గురించి చెప్పుకుంటున్నారు. చిరుగాలికి పెరట్లో ఉతికి జామచెట్టు కారేసిన దేవి పైట వోణీ రెపరెప లాడుతోంది. ఆ పెద్ద పిల్లతో కలుపుకొని ఆ వంటింట్లో మండుతున్న కుంపటితో కలుపుకుని ఆ దంపతుల గుండెల మీద ఐదు కుంపట్లు వున్నాయి.

యెక్కడి నుండో చిరుగాలి పొరపాటున వంటింట్లోకి జొరబడ్డది. జగన్నాథం నుదుటి మీద అనుభవాలు వేసిన ముడుతల మధ్య లాస్యం చేస్తున్న స్వేదబిందువుల్ని తాకింది. తర్పణంచేసి బాహ్యప్రపంచంలోకి వచ్చారు జగన్నాథం. పీట వేసుకుని కుంపటి దగ్గర కూర్చున్నారు.

"యింకా యెంతకాలమండీ........" కాఫీ యిస్తూ శాంతమ్మ అడిగింది బాధగా.

"నేనేం వూరికే కూర్చున్నానా...." ప్రతీ రోజూ యిచ్చే సమాధానమే.

"అదిగాదండీ అటు చూడండి. రాధ తర్వాత వాళ్ళు ముగ్గురూ తోటకూర కాడల్లాగ పెరిగిపోతున్నారు. కాలాన్ని మనం ఆపలేం కదామరి యేదో వొకటి చెయ్యాలండీ...." గాదదికంగా అంది శాంతమ్మ కన్నీటి తెర ఆమెలో వుండే ఆవేదనని కప్పేట్టేసింది.

"అలాగే శాంతా....ఈ సంవత్సరాంతం లోగా యెలాగైనా పెద్ద దానికి కానిచ్చేదాం." అన్నారు అరవై ఏళ్ల దగ్గర పడుతున్న ఆయన కంఠం కొంచెం వణికింది.

"పోనీ పెద్దవాడితో నయినా కొంచెం చెప్పండి. మీకు వీలులేకపోతే నేనయినా వాడింటికి వెళ్ళి చెబుతాను."

వేదాంతిలా నవ్వారు జగన్నాథంగారు.

"నీకింకా మమకారం పోలేదు శాంతా.

★ పరువు ప్రతిష్టలకోసం తెరల వెనుక జీవితం సాగించగలిగినా, ఆకలిని కప్పే తెర సంపాదించడానికి జీర్ణించి ఉన్న తెరలను తొలగించక తప్పదు ఒక్కొక్కసారి! ★

పురుట్లో తల్లి పోయినవాడికి తల్లివై కంటి పాపలా పెంచావు. నీ పిల్లలకు వున్నా లేక పోయినా వాడికే అసౌకర్యం లేకుండాచేసావు. వాడేదో చదివి పెరిగి పెద్దవాడై మనల్నంతా వుద్ధరిస్తాడని రెక్కలు ముక్కలు చేసుకుని చదివించాను. మనకి వాడేం శిక్ష వేసాడో తెలుసా?" బాధగానే ప్రశ్నించారు.

ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో ఉద్యోగం యిప్పించి లక్షణంగా పెళ్లి చేస్తే పెళ్ళాం మాటలు విని వూళ్లోనే వేరే కాపురంపెట్టి, ఆ యింటి ఛాయలకే రావటం మానుకున్నాడు. మొదటి సంబంధం కొడుకు.

"పోనీలెండి. యిప్పుడవన్నీ యెందుకు గత జల సేతు బంధనం. అవసరం మనది........ "ఒసేవ్ పిల్లలు యింకా యేం చేస్తున్నారు. రండి కాఫీ త్రాగుదురుగాని తమ్ముడి నిద్ర లేపండ్రా...." వంటింటినుండే కేకవేసింది. కోడిపెట్ట మన స్తత్వం శాంతమ్మది, తన పిల్లలు యే గ్రద్దబారి పడకుండా తన కనుసన్నల్లోనే మెలగాలని ఆమె తపన.

"యీ పూటకు బియ్యం నిండుకున్నాయండి. నాలుగు రోజులుగా యిరుపొరుగుల్ని అడిగి తెచ్చాను. యింక యెవ్వరూ...." నిస్సహాయత ప్రతిధ్వనిస్తోంది.

"యీ వొక్క పూటకు యెలాగయినా తీసుకువస్తాను." మధ్య గదిలోకి వెళ్ళిపోయారు అంతకన్నా నిస్సహాయంగా కొన్ని క్షణాల తర్వాత.

"యీ చీకటి గూడా ఈ యింట్లో దరిద్రం లాగే తిష్టవేసుకుని కూర్చుంది." గొణుక్కుంటూ వెతుక్కుంటున్నారాయన ఆ ప్రక్క గదిలోకి వెళ్ళి. ఆ గదిలో రాట్నంమీద దారం టప్పుమని తెగిపోయింది. పెద్ద కూతురు రాధ యేకాగ్రతకు భంగమే కలిగింది.

"యేమిటి నాన్నగారు వెతుకుతున్నారు" రాట్నం ఆపి అడిగింది.

"యేం లేదమ్మా జోళ్ళు వెతుకుతున్నాను తల్లీ. కాళ్ళకు ఆనెలుంటే పీడు మనం లేక పోతే నడవలేడు కదా అని. అవి అప్పుడప్పుడు నాతో దొంగాటలాడుతూ వుంటాయి" అని తడుముకుంటున్నాడు.

రాధ వెలికి తీసిందా హవాయి చెప్పుల్ని.

"నాన్నగారూ పట్టీ తెగిపోయిందండీ...." అంది బాధగా రాధ.

"వాటికి గూడా తెలిసిపోయింది యింక నేను యెందుకూ పనికిరానని" కంఠంలో దుఃఖం జీర కదలాడుతోంది.

"అవేం మాటలు. దీన్ని నేను కుట్టేసి సరి చేస్తాను నాన్నగారూ." సూదీ దారం పట్టుకొని వీధి గదిలోకి వచ్చింది.

వీధి గదిలోనూ అంత వెలుగు లేదు. వీధి గుమ్మానికి తెర వేలాడుతోంది. చిరుగాలికి, అ స్తవ్య స్తంగా వూగుతూ. వాటి కొసలు అక్కడక్కడా పీచులు తెగిపోయి వున్నాయి. దాన్ని దూరం నుండి చూస్తే అవి చిరుగులకు వేసిన కుట్లో, క్రొత్తరకం యెంబ్రాయిడరీయో యెవ్వరూ పోల్చుకోలేదు.

"నాన్నగారూ ఈ నెల షాహుకారు జీతం యివ్వలేదా? తమ్ముడికి స్పెషల్ ఫీజులు యూనిఫారమ్ డ్రెస్ లేకపోతే స్కూలుకి రానివ్వనంటున్నారట. గోల పెడుతున్నాడు వాడు...." నెమ్మదిగా అడిగింది రాధ.

"ఈ నెలేకాదు. యింకే నెలా జీతం యివ్వరమ్మా. వాడికీ మనకీ ఋణానుబంధం సరి. సరిగ్గా చూపానరన్న మిషతో తీసేసి ముందు వాడిన అడ్వాన్సులకు విగగొట్టుకున్నాడు. అప్పుడే వారం రోజులైంది." మరేం మాట్లాడ లేదు జగన్నాధంగారు.

"మరి...." రాధ కంఠంలో బెంగ తొంగి చూసింది.

"ఈ విషయం తెలిస్తే మీరంతా బెంగపడి పోతారని చెప్పలేదు. రోజూ రామమందిరం దగ్గర కూర్చుంటున్నాను. పురోహితులంతా అక్కడ చేరతారుకదా..యెవరయినా యేదయినా పని చెబితే చేయటం దానాలు పట్టటం...." మరి చెప్పలేకపోయారు. భయం తెర అతని మనస్సును కప్పేసింది.

రాధకు మరి నోట మాటరాలేదు.

"మాకోసం యెంత శ్రమపడుతున్నావు నాన్నా!...." మనస్సులోనే దుఃఖం దిగమింగుకుంది. కుడుతున్న హవాయి చెప్పువంక చూసింది. అవి బాగా అరిగిపోయి పల్చని అట్ట ముక్కల్లా వున్నాయి. వాటి మధ్యన కాలి ఆనెలు చేసిన బరువు ముద్రలు దీనంగా కన్పిస్తున్నాయి లాగుతున్న భారజీవితాన్ని ప్రతిబింబిస్తూ.

మరో క్షణంలో ఆ రెండు కాళ్ళు చెప్పుల్లోకి దూరాయి. గుమ్మం తెరవరకూ వచ్చి ఆగిపోయాయి.

"అమ్మా! రాధా! మళ్ళా ఈ తెర మధ్యగా నిలువుగా చిరుగు పడిపోయింది దీన్ని కుట్టమ్మా. లేకపోతే పెద్దది అయ్యేటట్లుగానే వుంది" అన్నారు బాధగా.

"అది బాగా చిరిగిపోయింది నాన్నగారూ!" అని అంటే యేం సమాధానం వస్తుందో రాధకు తెలుసు. ఒకనాటి సమాధానం ఆమెకు గుర్తుకు వచ్చింది.

"ఈ తెర గుడ్డకు పెద్ద చరిత్ర వుందమ్మా. నువ్వు మీ అమ్మ కడుపులో నున్నపుడు కొన్నానమ్మా. అప్పటిది చాలా గట్టిగా, మందంగా వుండేది. యిన్నేళ్ళు మన కుటుంబ చరిత్ర దీని వెనకాతలే వుంది. ఈ యింట్లోవాళ్ళకి కట్టుకుందికి వొకే బట్టతప్ప మరి లేదని, వొకపూటే అన్నం అవకాశం వుంటే తింటారని, ఈ యింట్లో మనుషుల వ్యక్తిత్వాలూ మమతల మధ్య దారిద్ర్యం వొక్కటే విలయతాండవం చేస్తుందన్న నగ్న సత్యాల్ని బయటి ప్రపంచానికి తెలియకుండా కాపాడుతోందమ్మా...." అనేవారు జగన్నాధంగారు ఆ తెరని మనసారా ఒకసారి తడిమి.

"అలాగే నాన్నగారూ...." అంటూ వర్తమానంలోకి వచ్చి సమాధానం యిచ్చింది సూదిలో మళ్ళా దారం యెక్కిస్తూ, తండ్రి గుమ్మందాటి బయటకు వెళ్ళడం చూస్తూ.

యింతలో రాధ ప్రయత్నాన్ని వంటింట్లో కేకలు అడ్డుకున్నాయి.

"ఈ యింట్లో యెప్పుడూ బెల్లం కాఫీయేనా!




యిది త్రాగలేక కడుపులో దేవేస్తోంది. దరిద్రం కొంప...." కాఫీ గ్లాసు దభేలున నేలమీదన యేత్తేశాడు భార్గవ. గచ్చులూడిన నేల పీల్చేసిందా కాస్త కాఫీని.

"యేమిటి భార్గవా ఈరోజూ ఈ అల్లరి. యింట్లో లేదని యేడవనా లేక నీ అల్లరికి యేడవనా. నాకు చావొచ్చింది కాదు" తల్లి తల గుమ్మంకేసి కొట్టుకుంటోంది.

రాధ అకస్మాత్తుగా వచ్చి అడ్డుకుంది. కానీ అప్పటికే తల చిట్లి రక్తం కారుతోంది.

"యేమిటమ్మా నువ్వునూ....వాడి సంగతి తెలిసిగూడా...."

"వాడు నా కొడుకు కాడే. నా ప్రాణాలు తీసేస్తున్నాడే. యింట్లో దేనికని యేడవను. ఈ గుండెలమీద కుంపట్లు మంటలకే యేడవనా?




భగవంతుడు నాకు చావు తెప్పించేడు కాదే తల్లీ....” అంది రాధ వొడిలో తలపెట్టుకుని. పసిపిల్లలా యేడ్చేస్తోంది శాంతమ్మ. మిగిలిన ఆడపిల్లలు యేం తోచక చూస్తున్నారు.

“యింట్లో యేదుంటే అది త్రాగాలి. కానీ నీకోసం పంచదార యెక్కట్నించి తెస్తుందిరా.” అడిగింది దేవి బాధగా.

“అనండే మీరూ అనండే. పెళ్ళి పెటా కాలూ లేక వి్రవీగిపోతున్నారు. మీవల్లనే నాకేం ముద్దు ముచ్చట జరగలేదు. మీరెవ్వరైనా పోతేగాని ఈ యింటికి పట్టిన దరిద్రం వదల్దు'' గట్టిగా అరిచాడు.

“ఒరేయ్! అతిగా మాట్లాడకు. దవడ పళ్ళు రాలగొట్ట గలను.” అంది దేవి. కోపంతో ఆమె బుగ్గలు యెరుపెక్కి పోయాయి.

“ఊరుకోవే దేవీ....” గద్దించింది రాధ.

“ఛీ....ఛీ....ఈ యింట్లో వుండి చదువుకోవడం కన్నా చదువు మానేసి యెక్కడయినా కప్పులు కడుక్కుంటూ బ్రతికితే బాగుంటుంది. అన్నయ్యగారింట్లో పిల్లలకి యెంచక్కా స్కూలు యూనిఫారమ్ అన్నీ వున్నాయి....” భార్గవ గొంతుకలో—దుఃఖం తెర రెపరెపలాడుతోంది.

“చూసావే.... చూసావే........వాడేమంటున్నాడో....పోరా .... పోతేపో — యెవడున్నద్దరించాలివుండి.”అని రెచ్చిపోయింది, శాంతమ్మ.

“వెళ్తానే ఆరోజు దగ్గిరలో వుంది....” ముక్కుపుటాలు యెగ చీల్చుకుంటూ, వెళ్ళి పోయాడు, పధ్నాలుగేళ్ల నిండీ నిండని భార్గవ పుస్తకాలు చేత్తో పట్టుకొని!

“వాడంటే పసివాడు, తెలిసీ తెలియని వయస్సు. నువ్వెందుకమ్మా అలా వాడితో పోట్లాడతావు” అంది రాధ అనునయంగా.

“పోట్లాట కాదే తల్లీ ప్రాణాలు తీసేస్తున్నాడు. రచ్చకెక్కిస్తున్నాడు ఒసేయ్ దేవీ, కమలా, విమలా యేం చేస్తున్నార్రా కుండీలోకి నీళ్ళు తోడండి....” అంటూ నీరసంగానే లేచింది శాంతమ్మ.

నుదుటి గాయంలో రక్తం గడ్డ కట్టి పోయింది.

* * *

దేవి, కమలా వాళ్ళిద్దరూ వీధి గుమ్మం తెర దగ్గర వున్నారు. తెర చిరుగులో నుండి బయటి ప్రపంచాన్ని చూస్తున్నారు. మధ్యన రోడ్డు, రోడ్డు కవతల చక్కటి మేడ....మేడచుట్టూ చిన్న పిట్టగోడ. లోపల రకరకాల పూలచెట్లు. ఆ మేడ ఈమధ్య యెవరో కొనుక్కుని బాగు చేయించుకున్నారు. కుటుంబాన్ని యింకా తీసుకు

రాలేదు. ఒక నడివయస్సాయన కొంచెం కుంటుకుంటూ నడుస్తాడు ఆవరణలో. ఎప్పుడూ తెల్లని మల్లెపూవులాంటి బట్టలతో మేడమీద వరండాలో కూర్చుని సిగరెట్లు కాలుస్తుంటాడు. బంగారం ఫ్రేము కళ్ళజోడు తగిలించుకొని, స్టూలుమీద పుస్తకాలు వేసుకుని చదువుకుంటూ వుంటాడు....చిరుగులో నుండి వొక గాలి రివట రెండు రోజులనుండీ తైల సంస్కారం లేని దేవి ముంగురులను రెపరెపలాడించింది ఆమె మనస్సులోని ఊహలతో బాటు.

"అలాంటి మేడ, సినిమాల్లో చూపించే సోఫాసెట్లు, నవలల్లో వర్ణింపబడే అందమైన ఆరడుగుల ఉంగరాలజుత్తు హీరో. అమెరికాలో చదివినవాడు—యింపాలా కారు, 'డార్లింగ్ నీకు డబ్బు లేకపోయినా సరే. మీ వూళ్లోవున్న పదవ క్లాసువరకూ చదివినా సరే, నీవు నా పాలిట జయసుధవే. నిన్ను తప్ప మరొకర్ని చచ్చినా పెళ్ళాడను. నా ప్రేమను స్వీకరించు.' పువ్వుల మొక్కలమధ్య ఆ హీరో తన చేతిలో వొటు వేసున్నపుడు అందమైన యెర్రగులాబీ తన జడలో తురుముతున్నపుడు...." కలల్తో కళ్ళు మూసుకుంది దేవి.

"ఆ మేడింటి వాళ్ళకో తన ఈడు అబ్బాయుంటే, ఆ అబ్బాయి మెళ్ళో యెంచక్కా జమీందారిలాంటి పులిగోరు పతకం, నాలుగు వేళ్ళకు వుంగరాలు, అందమైన గుండ్రని ముఖంతో, కళ్ళకు చారడేసి కళ్ళతో తనతో తొమ్మిదవ క్లాసు చదువుతూ, ఆప్యాయంగా.... 'రా కమలా! నా రిక్షాలోనే రోజూ బడికిపోదాం.' అంటూ రిక్షాలో యెక్కించుకొని బడికి వెళుతూ వుంటే, పొరుగింటి స్వర్ణా, యిరుగింటి అమలా ఈర్ష్యతో వుడికిపోవాలి." అనుకుంటోంది కమల.

"యేం చేస్తున్నార్రా యిక్కడ మీ రిద్దరూ" అంది రాధ.

"ఏంలేదు. ఈ తెరగుడ్డని చూస్తున్నాను." అంది కమల తన కలలమీద, అబద్ధం తెరని కప్పేసి.

"తెర గుడ్డని చూసేదేమిటీ...." నవ్వింది రాధ.

"పగిలిపోయి, చిట్లిపోతున్న ఈ తెర మన గుమ్మాన్ని యింకా యెంతకాలం అంటిపెట్టుకొని వుంటుందో నని ఆలోచిస్తున్నాం" అంది దేవి.

"దానికీ మనకీ యెంతకాలం ఋణానుబంధం వుంటే అన్నాళ్ళు వుంటుంది. అమ్మ పిలుస్తోంది" అంది, రాధ సూదిలోకి దారం యెక్కిస్తూ.

అప్రయత్నంగానే మేడవేపు చూసింది రాధ. అతనువచ్చి అప్పుడే కుర్చీమీద కూర్చున్నాడు. అతను రోజూ పుస్తకాలు చదువుతాడో, రోడ్డు మీద వచ్చేపోయే జనాన్ని చూస్తాడో తెలియదు. తన వొకసారి బజార్లో వడికిన నూలు అమ్ముతూంటే పుస్తకాల షాపు దగ్గర నిలబడి పుస్తకాలు కొంటున్నాడు, కుష్ఠురోగమో యేమో పాపం చేతివేళ్ళుకూడా వంగివున్నాయి.

పాపం భార్య విడాకులు యిచ్చేసిందట రోగిష్టివాడని. యివన్నీ పనిమనిషి అమ్మతో చెబుతూంటే తను వింది.

రాధ ఆలోచనలు మాని చిరుగును కుట్టడం ప్రారంభించింది. గట్టిగా పట్టుకుంటే మరోచోట చిరిగిపోయే పరిస్థితి యేర్పడిందా తెరకు. అది కుడుతూండగానే మరొక చిరుగు.

"నిన్నింక యెంతోకాలం కుట్టుకుట్టి శ్రమ పెట్టను. మా పరువు మర్యాదల్ని యింతకాలం కాపాడావు. నీకింక విశ్రాంతి నిస్తాను." అంది కృతజ్ఞతాపూర్వకంగా. రాధ వడికిన నూలు అమ్మి యింటి ఖర్చులకు కొంత పోగా, తెర గుడ్డ కొనాలని కొంచెం కొంచెం దాచిన డబ్బు యెప్పటికప్పుడు యింటి ఖర్చులక్రిందే పడిపోతూ వుండేది. ఈసారిమాత్రం యెంతో శ్రమ పడి, యెనిమిది రూపాయలు కూడబెట్టింది. ఇంకొంచం కాలం వోపిక పడితే పది రూపాయలకు వొక చవకరకం తెరగుడ్డ రాకపోదు.

రెండో చిరుగులో యెదురింటాయన తమ యింటి గుమ్మంవేపే చూస్తున్నాడు. రాధ మేడ వేపు చూస్తోంది.

"నా తమ్ముడ్ని కష్టపడి చదివించాలి. గొప్పవాడ్ని చేయాలి, అలా యింటిని, ఆ మేడలాగ అందంగా కట్టించాలి. వాడు పెద్ద వుద్యోగం చేస్తూ తన తల్లినీ, తండ్రినీ సుఖపెట్టాలి' ఆ రోజు....ఆ రోజు....కోసం...." యిలా దృఢమైన ఆలోచనలతోనే రెండో చిరుగు కుట్టడం పూర్తిచేసి స్నానానికి వెళ్ళడానికి వెనక్కు తిరిగింది.

"ఊఁ నెమ్మదిగా సాయం పెట్టండి...." అన్న మాటలు వినిపించి వెనక్కు తిరిగింది.

రిక్షావాడు, చిన్ననాటి నేస్తం, సీతారామయ్యగారూ తన తండ్రిని సాయం పట్టి లోపలకు తెస్తున్నారు.

"అమ్మాయ్ రాధా! ఇక్కడ మంచం వెయ్యమ్మా...."

జగన్నాధంగారి వొంటిమీద తెలివిలేదు. రాధకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మంచం తెచ్చి దానిమీద చిరిగిన బొంత వొకటి వేసింది.

"యేం జరిగిందన్నయ్యగారూ!" ఆతృతగానే అడిగింది శాంతమ్మగారు రుద్ధమైన కంఠంతో.

"యేం లేదమ్మా! రామ మందిరం దగ్గర కొంచెం రక్తం కక్కుకుని స్పృహ తప్పి పడిపోతే....ఆహా మరే బెంగ పడకండి. యేదో కొంచెం వేడిచేసి వుంటుంది. తగ్గిపోతుంది. కొంచెం జ్వరంగూడా వచ్చినట్టుంది. పెద్దాడిని పంపిస్తాను. డాక్టర్ను తీసుకు వస్తాడు. నేను వూరికి వెళ్ళాలి" అంటూ వెళ్ళిపోయారాయన.

* * *

మధ్యాహ్నమయినా ఆ ఇంటికి పెద్దకొడుకు రాలేదు. జగన్నాధంగారు మూసిన కన్ను తెరవలేదు. రాధే డాక్టరును తీసుకువచ్చింది. డాక్టరు పరీక్షచేసి యింజక్షనూ, వో పెద్ద మందుల లిష్టు రాసి వెళ్ళిపోయాడు.

గుమ్మంవరకూ వెళ్ళి తను కొత్త తెరగుడ్డ కొందామని వుంచిన డబ్బు, డాక్టరుకి ఫీజుకింద యిచ్చేసింది. ఆ యింట్లో సభ్యులకు ఆ పూట అన్నం తినలేదన్న సంగతిగూడా భయం తెర తెలియనివ్వలేకుండా చేసింది.

దీపాలు పెట్టే వేళ కళ్ళు తెరిచారాయన. కొంచెం జ్వరం తగ్గి చెమటపట్టింది. సీతారామయ్యగారు వచ్చారు.

"పెద్దవాడితో చెప్పారా అన్నయ్యగారూ?" అడిగింది శాంతమ్మ.

"చెప్పానమ్మా....వాడిక్కడికి రాడమ్మా.... వాడోకబురు చెప్పాడమ్మా...." ఆగారు సీతారామయ్యగారు.

అంత నీరసంలోనూ జగన్నాధంగారు, కళ్ళింతలు చేసుకొని వింటున్నారు.

"జన్మనిచ్చిన తండ్రిని జాగ్రత్తగా చూసుకోవటం తన ధర్మమని అందుకని వీళ్ళందర్ని వదలి నీవు అక్కడికి వచ్చేస్తే నిన్ను పోషించడానికీ, నీ బాగోగుల్ని చూసుకోవడానికి తనకేం అభ్యంతరం లేదని...." సగంలోనే ఆగిపోయాడు. జగన్నాధం కళ్ళనుండి విస్ఫులింగాలు వర్షిస్తున్నాయి. తారాజువ్వలా లేచాడు.

"ఈ మాట చెప్పడానికి నీకెంత సిగ్గులే

(వి)చిత్ర విజ్ఞానం




కేరళలో ఉప్పునీటి కాలువలు చాలా వున్నాయి. అక్కడ "కైనాకారి" అనే గ్రామంలో ప్రభుత్వం ఒక "పడవ పోస్టాఫీసు"ను స్థాపించింది. పోస్టు మాష్టరు యీ పడవ పోస్టాఫీసును గడవేసి నడుపుతూ కాలువల ఒడ్డున వున్న ఊళ్లకి వెళ్లి ఉత్తరాలు అందిస్తాడు!

దయ్యా!! ఆ బోడి పోషింపు యెవడికావా లయ్యా. నేను బ్రతికుండగానే నా పిల్లలు దిక్కులేని వాళ్ళయిపోవాలా. అలా జరగ దయ్యా. నేను జన్మనిచ్చినా వాడికి పునర్జన్మ ప్రసాదించింది. నా శాంత....వాడికి చిన్నపుడు న్యుమోనియా వస్తే యింక మన పిల్లడు కాడని అరుగుమీద పడేస్తే రాత్రనక, పగలనక కళ్ళల్లో వత్తులు వెలిగించుకుని బ్రతికించు కుంధయ్యా యిదయ్యా! దానికి వాడిచ్చే ప్రతి ఫలం. విశ్వాస ఘాతకుడు వాడు అనుభవిస్తా డయ్యా. ఇంతకింత....ఒరేయ్ పితృద్రోహి నువ్వు... నువ్వు...."మాటతడబడింది. కుప్పలా కూలిపోయాడు కుక్కి మంచంమీద.

డాక్టరిచ్చిన మాత్ర తండ్రిచేత మింగించింది రాధ.

రాత్రి జగన్నాధం గారికి తెలివి వచ్చినప్పు డల్లా కొడుకుని తిడుతూనే వున్నాడు....ఆ రాత్రల్లా రాధకు నిద్రలేదు.

* * *

సూర్యోదయమైంది. తొమ్మిది గంటల ప్రాంతంలో నిద్రలేచారు. కాఫీ త్రాగిన తరువాత కొంచెం తేలిగ్గా వున్నారు. గాలికి నీరసంగా కదుల్తున్న తెర ఆయనకు సుప్రభాతం పలుకు తోంది. పిల్లల బ్రతుకులకో దారి చూపించాల్సిన బాధ్యతల తెరలా, దాని నీడ ఆయనమీద రెప రెప లాడుతోంది.

"యిది తెగితేనే కానీ నాకు విముక్తిలేదు. ముక్తిలేదు. యేం చేయలేకపోతున్నాను...." ఆయన కన్నీటి తెర కరిగిపోయింది. కొన్ని క్షణాల తర్వాత యింటి గుమ్మం ముందు రిక్షా ఆగినట్లుగా చిరిగిన తెరలో నుండి స్పష్టంగా జగన్నాధంగారికి కన్పించింది. అందులో నుండి రాధ పెద్ద అట్టపెట్టెలతో దిగి, రిక్షావాడిచేత లోపలికి పట్టించుకొని రావటం కన్పించింది. జగన్నాధంగారు ఆశ్చర్యపోయారు.

"యేమిటమ్మా యిది...."

"మందులూ, పళ్ళు నాన్నగారూ. డాక్టరుగారు మీకు కొన్ని నెలలపాటు విశ్రాంతికావాలన్నారు. అందుకని...." మరేం మాట్లాడలేక పోయింది.

"నా కెందుకమ్మా! ఇది మామూలు జ్వరమే కదా. రేపటికో యెల్లుండికో తగ్గదూ. ఏకాదశి నాడు సూరావధాన్లు, సత్యనారాయణ వ్రతం చేయించమన్నాడు." అన్నారు నీరసంగా, దగ్గర బల్లమీద మందులు సర్దుతూ.

"మీ నాన్నగారికి బ్లడ్ కాన్సర్. చాలా అశ్రద్ధ చేస్తారు. బహుశా యెంతోకాలం బ్రతకరు. అయినా ఉపశమనానికి మందులు వాడండి.... ఆయనసలే కదలగూడదు. చాలా జాగ్రత్త డాక్టరు చెప్పిన"—నగ్నసత్యాన్ని రాధలోని మమతల తెరలు చెప్పనివ్వకుండా కప్పేశాయి.

కూతురు చేస్తున్న పని వొక్కొక్కటే ఆయనా అప్పుడే కాఫీ తెచ్చిన తల్లీ చూస్తు న్నారు.

గుమ్మానికి, కొన్ని సంవత్సరాలుగా అంటి పెట్టుకుని రక్షణ కల్పించి జీర్ణమైపోయిన తెర గుడ్డను తొలగించింది. లతల డిజైన్లతో అంద మైన చక్కని తెర పాత దాని స్థానాన్ని అలంక రింపజేస్తూ, ప్రయత్నపూర్వకంగానే మేడవేపు చూసింది, రాధ.

"యింకా ఈయనగారు నిద్రనుండి లేవ నట్లుగా వుంది" అని మనస్సులో వొక చిరు నవ్వు తెరను దాచింది, అనుభవం నిజంమీద!

"యింత ఖరీదయిన మందులు,టానిక్కులు, యాపిల్సు, హార్లిక్సు, బోర్నవిటా యివన్నీ కొనడానికి నీకు డబ్బెక్కడిది?...." తెరలు తెర లుగా వస్తున్న జగన్నాధంగారి అనుమానాలూ...

"బియ్యం, పప్పులూ, నెయ్యి, తమ్ముడికి యూనిఫారం, చెల్లెళ్ళకు వోణీలు యివన్నీ కొనడానికి డబ్బెక్కడిదీ...." అని తల్లి గుండెల రగులుకొంటున్న అనుమానాలూ....

యివన్నీ ఆ దంపతుల పెదవుల్ని దాటలేదు. వాళ్ళు దరిద్రం మురికిపట్టిన పీలికలు కావడానికి సిద్ధంగా వున్న పాత తెర గుడ్డను రాధ పెరట్లోకి తీసుకు వెళ్ళిపోతున్న దృశ్యాన్ని మాత్రం చూసారు నిస్సహాయంగా. □